క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ పరిశీలన



పరిశీలనలో ఆశ్రిత్ తదితరులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక 18వ వార్డులో పారిశుద్ధ్య పనుల గురించి ఆరా తీశారు. మురుగు కాలువల్లో చెత్త, మట్టి తొలగించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డుపై చెత్త వేయవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. చెరువును పరిశీలించి. అందులో ఉన్న చెత్త, చెట్లను తొలగించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు శేఖర్, రాజు, అధికారులు అన్వేష్, వనిత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



పరామర్శిస్తున్న రఘోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): కొండపాక మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ అనంతుల శారద కుటుంబాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ శారద

చిన్నకోడూరు(సిద్దిపేట): పిల్లలకు పౌష్టికాహారం అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ శారద సూచించారు. మండల పరిధిలోని మైలారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన బరువుల మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించి నిత్యం ఎత్తు, బరువులు పరిశీలించాలని సూచించారు. పాలు, పండ్లు, గుడ్లు, ఆకు కూరలు తినిపించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ టీమ్ సభ్యులు శ్రీనివాస్, సూర్యప్రసాద్, సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

అండగా హరీశ్‌రావు



సరుకులు అందజేస్తున్న నేతలు

నంగునూరు(సిద్దిపేట): ప్రజల కష్టం తన కష్టంగా భావించే హరీశ్‌రావు ఆపద కాలంలో అండగా ఉంటారని మాజీ ఎంపీపీలు జాప శ్రీకాంత్‌రెడ్డి, రాగుల సారయ్య అన్నారు. అక్కేనపల్లిలో ముంపునకు గురైన ప్రాంతాన్ని బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుడగ జంగాల కాలనీ నీట మునిగిందని తెలియగానే ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులను పంపించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతి, లక్ష్మారెడ్డి, వెంకటేశం, సిద్దేశ్వర్, మల్లయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ మహబూబ్

మద్దూరు(హుస్నాబాద్): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ షేక్ మహబూబ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో యాంటీ ఉమెన్స్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం ఉంటేనే తప్ప సోషల్ మీడియాను ఉపయోగించవద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని, ఆడపిల్లలను ఎవరైనా వేధిస్తే 100కు డయల్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది సిద్ధార్థ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

తీరని నష్టం.. వీడని కష్టం



చిన్నకోడూరు(సిద్దిపేట): ధ్వంసమైన చౌడారం- మేడిపల్లి బీటీ రోడ్డు



కోహెడరూరల్(హుస్నాబాద్): తంగళ్లపల్లిలో కూలిన ఇల్లు

ఇటీవల కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు మండలాల్లోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అదే విధంగా కొన్ని గ్రామాల్లో ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేల కూలాయి. బీటీ రోడ్లు ధ్వంసమై రాళ్లుతేలి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి సూచనలు చేస్తున్నారు.



మద్దూరు(హుస్నాబాద్): జాలపల్లిలో కూలిన ఇళ్లనుపరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదన్



అక్కన్నపేట(హుస్నాబాద్): కూలిన ఇంటిని పరిలీస్తున్న ఎంపీడీఓ జయరాం

మట్టి గణపతి.. మహా గణపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనదే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్

సిద్దిపేటజోన్: మట్టి గణపతి.. మహాగణపతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వినాయక చవితి నేపథ్యంలో బుధవారం స్థానిక గాంధీ చౌక్ వద్ద అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సిద్దిపేట నెలవు అన్నారు పదేళ్లుగా సమితి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారన్నారు.

నా కళ్లలో నీళ్లు వచ్చాయి

రాష్ట్రంలో వరదల పరిస్థితి దారుణంగా ఉందని, ఆయా ప్రాంతాల్లో కష్టాల్లో ఉన్న ప్రజలను చూస్తే కళ్లలో నీళ్లు వచ్చాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని దాతలు ముందుకు వచ్చి, చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు మున్సిపల్ చైర్మన్, పాలకవర్గం సభ్యులు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్, పలువురు వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు చిన్న, సాయిరాం, సేవా సమితి ప్రతినిధులు భూపతి, రత్నాకర్, రమేశ్, కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు ప్రతిరూపం గురువు

ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా తమకు విద్యనేర్పిన గురువు కన్పిస్తే ఆత్మీయత కలుగుతుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువుల దినోత్సవం సందర్భంగా టీఎన్జీవో భవన్ ఆధ్వర్యంలో బుధవారం 18 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించడం గొప్ప అనుభూతి ఇస్తుందన్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: వినాయకచవితి, మిలాద్‌ఉన్‌నబీ పండుగలను ప్రశాంత వాతావరణలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. పండుగల సందర్భంగా బుధవారం ఆయన పోలీస్ కమిషనర్ బి.అనురాధతో కలిసి జిల్లా అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాలు, నిమజ్జనం తదితర కార్యక్రమాల గురించి సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నిమజ్జన ప్రదేశాలను సంబంధిత అధికారులు సందర్శించి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని సూచించారు. సీపీ అనురాధ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ , ఆర్డీఓలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, డీపీఓ దేవకీదేవి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, మత్స్య శాఖ అధికారి సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం..

- చెరువుల వద్ద పటిష్ట బందోబస్తు
- రెస్క్యూ టీమ్‌లతో పర్యవేక్షణ
- చైర్‌పర్సన్ మంజుల



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్, ఏసీపీ మధు తదితరులు

సిద్దిపేటజోన్: వినాయక చవితి సందర్భంగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేద్దామని మున్సిపల్ చైర్‌చైర్మన్ మంజుల రాజనర్స్ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పండుగ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.. ఈ సందర్భంగా చవితి నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, ఏసీపీ మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి సమీక్ష నిర్వహించారు. మండపాల కమిటీ నిర్వాహకులు మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, పోలీస్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఉత్సవ ర్యాలీల సమయంలో విద్యుత్ వైర్లకు చెట్టు కొమ్మలు తగలకుండా చూడాలని, చెరువుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, రెస్క్యూ టీమ్‌లు ఉండేలా చూడాలని సూచించారు. అంతకు ముందు ఏసీపీ మధు మాట్లాడుతూ విగ్రహాల నిమజ్జనం ప్రక్రియ మూడు రోజులు మాత్రమే ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రూట్ మ్యాప్ మేరకు నిమజ్జనం కోసం తరలివెళ్లాలని పేర్కొన్నారు. 15న మిలాద్ ఉన్ నబీ నేపథ్యంలో 19న ర్యాలీ నిర్వహణకు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. కాబట్టి 18లేదా 20 తేదీల్లో మాత్రమే విగ్రహాలు నిమజ్జనం చేయాలని, శాంతిభద్రతల దృష్ట్యా 19న నిమజ్జన ప్రక్రియకు అనుమతి లేదని చెప్పారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కోమటిచెరువును సందర్శించారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ డీఈ ప్రేరణ, అధికారులు అన్వేష్, సతీశ్, వనిత, మాధవి, విద్యుత్ అధికారి రమేశ్, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దు

- ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్/తొగుట(దుబ్బాక)/సిద్దిపేటఅర్బన్/మిరుదొడ్డి(దుబ్బాక): అందరూ కలిసి, మెలసి పండుగ నిర్వహించుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ లక్ష్మీబాబు అన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగల సందర్భంగా ముస్లిం పెద్దలతో వన్ టౌన్ పీఎస్‌లో బుధవారం ఏసీపీ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మజీద్‌లలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఏమైనా సమస్య ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో తంజీమ్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, సీఐలు ఉపేందర్, విద్యాసాగర్, పోలీసులు పాల్గొన్నారు. తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులకు సీఐ లతీఫ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ రవికాంతరావు, ఏఈ శ్రీనివాస్, ఆర్‌ఐ అశోక్‌రాజ్ పాల్గొన్నారు. సిద్దిపేటలో త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో పోలీస్ స్టేషన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని చెప్పారు. మిరుదొడ్డి బాలాజీ గార్డెన్స్‌లో ఎస్‌ఐ బోయిని పరశురాములు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీజే సౌండ్‌లకు అనుమతులు లేవని చెప్పారు. ఆయా గ్రామాలకు చెందిన నిర్వాహక కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు. సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ శివారు లావణ్య గార్డెన్‌లో ఎస్‌ఐ అపూర్వరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కానిస్టేబుల్స్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఉద్యోగులను తొలగించడం సరికాదు

సిద్దిపేటకమాన్: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఉద్యోగులను తొలగించడం సరికాదని రాష్ట్ర గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సుమారు ఆరువేల మందిని మూడు నెలల నుంచి జీతాలు చెల్లించకుండా ఇప్పుడు అర్ధాంతరంగా తొలగించడం సరికాదన్నారు. తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆపన్నహస్తం అందించాలి

మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు



ఇళ్లను పరిశీలిస్తున్న హన్మంతరావు

నంగునూరు(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రాకు దేవుని దీవెనలు ఉన్నాయని, సరైన సమయంలో వర్షాలు కురిపించి దీవెనలు అందజేశారని మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు అన్నారు. నంగునూరు మండలం అక్కేనపల్లిలో వర్షాలకు బుధవారం బుడగ జంగాల కాలనీ నీట మునగడంతో గ్రామస్తులకు రైతు వేదికలో పునరావాసం కల్పించారు. విషయం తెలుసుకున్న ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి హరికృష్ణతో కలసి ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేసి వారితో కలసి భోజనం చేశారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, మహేందర్‌రావు, శంకర్, అత్తు, రాజేశ్వర్, యాదగిరి, నాగరాజు, సత్తయ్య, అశోక్, రమేశ్, రాములు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని తాడూరు గ్రామ శివారులో వాగుపై వంతెన నిర్మించాలని మాజీ సర్పంచ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భారీ వర్షాలు కురిసినపుడు గ్రామ శివారులోని వాగులో వరద ఉధృతి పెరిగి తాడూరు నుంచి చేర్యాల పరిసర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని వాపోయారు. సంబంధిత అధికారులు, నేతలు స్పందించి వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అందె వీరేశం కుటుంబానికి మండల వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బుధవారం రూ.20వేలు అందించారు. నాయకులు మాట్లాడుతూ వీరేశం మృతి వీరశైవ సమాజానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో మహదేవుని శ్రీనివాస్, మహదేవుని మల్లికార్జున్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయండి

- సీపీఎం జిల్లా నేత ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: ఎటువంటి షరతుల్లేకుండా రైతు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టు పేరుతో పునరావాస కాలనీల కోసం రైతుల నుంచి ప్రభుత్వం వందలాది ఎకరాల భూమిని సేకరించినట్లు గుర్తు చేశారు. వారు బ్యాంకుల ద్వారా రుణాలు పొందినప్పటికీ ప్రభుత్వం వాటిని మాఫీ చేయలేదని, తమ అవసరాల కోసం డబ్బులు దాచుకున్న రైతులకు చెందిన నగదును సీజ్ చేయడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయని, సమగ్రంగా సర్వే నిర్వహించి బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవాలని, ఎకరాకు రూ. 25వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అహ్మద్, ఐలయ్య, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని సీజ్ చేసిన పోలీసులు

దుబ్బాకటౌన్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం సీజ్ చేశారు. బేగంపేట ఏఎస్‌ఐ అమృత్ తెలిపిన వివరాల ప్రకారం రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన పబ్బ మల్లేశం కిరాణా దుకాణంలో అక్రమంగా 70 బస్తాల రేషన్ బియ్యంను నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం బేగంపేట, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మల్లేశంపై కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుకు మూగజీవాలు మృతి

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట(హుస్నాబాద్): పట్టణంలో బుధవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి పాడి గేదె మృతి చెందినట్లు రైతు సావుల చంద్రయ్య తెలిపాడు. దాని విలువ రూ.1లక్ష ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ వేణు యాధవ్ రైతును పరామర్శించారు. అలాగే హుస్నాబాద్ మండలంలోని తోటపల్లిలో పిడుగుపాటుకు బంక మల్లవ్వ పాడి గేదె మృతి చెందింది. పాల ఉత్పత్తి జీవనోపాధిగా బతుకుతున్న మల్లవ్వ ఇటీవలనే రూ.70వేలతో గేదెను కొనుగోలు చేసిందని, ఉపాధి లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోయారు. ఆర్థిక సహాయంచేసి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా అక్కన్నపేట మండలం రామవరం పరిధిలోని బంగారులొద్దితండాలో రైతు భానోతు భాస్కర్‌కు చెందిన దూడ మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని పలువురు రైతులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 9 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.14,500 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు

- దంపతులకు గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టడంతో దంపతులు సౌమ్య, చంద్రశేఖర్ గాయపడ్డారు. ఈ ఘటన మండల కేంద్రమైన శివారులో బుధవారం చోటు చేసుకుంది. సాంకేతిక సమస్య తలెత్తడంతో రోడ్డు పక్కన పార్కుచేసిన ఓ లారీని హైదరాబాద్ నుంచి జగిత్యాలకు కారులో వెళ్తూ ప్రమాదవశాత్తు వారు ఢీకొట్టారు. టోల్ ప్లాజా అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **అందరి కృషితో పర్యావరణ పరిరక్షణ**

గజ్వేల్‌రూరల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టినా కోరారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీలో పోటీలు నిర్వహించారు. ఉత్తమమైన విగ్రహాలను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అధ్యాపకులు డాక్టర్ సునీత, వీరయ్య పాల్గొన్నారు.

◆ **వరద బాధితులను ఆదుకోవాలి**

హుస్నాబాద్: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు, ఇళ్లు కూలిన పేదలను ప్రభుత్వం వెంటనే ఆదుకొని తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో వర్షాల కారణంగా జలమయమైన కాలనీలు, పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులుశ్రీనివాస్, వేణుగోపాల్ రావు, రాజేంద్రప్రసాద్, లక్ష్మణ్, చందు, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

◆ **త్రిసభ్య కమిటీ సందర్శన**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని పలు విద్యాసంస్థలను త్రిసభ్య కమిటీ బుధవారం పరిశీలించింది. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని బాలికల హాస్టల్‌ను, అదే ఆవరణలోని కేజీబీవీలను తనిఖీ చేసింది. వంటగదులు, స్టోర్ రూమ్, వాష్ రూమ్స్, డార్మెటరీలను పరిశీలించారు. బియ్యం, నిత్యావసర సామగ్రిని పరిశీలించారు. కమిటీ సభ్యులైన గజ్వేల్ డిప్యూటీ తహసీల్దార్ భార్గవ్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బల్బీర్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు ఆనంద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ**

తొగుట(దుబ్బాక): స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు రడం భాస్కర్‌గౌడ్ తండ్రి చంద్రాగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో తొగుట, దౌల్తాబాద్ మండలాల అధ్యక్షులు రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కొమురయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **హిందూ వాహిని నేతగా నాగపూజ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హిందు వాహిని మహిళా జిల్లా సహ సంయోజక్‌గా మద్దూరి నాగపూజను నియమిస్తూ జిల్లా సంయోజక్ బండి దీప నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నేతలు కస్తూరి భూంరెడ్డి, చల్ల బాల్‌రెడ్డి, బస్వరాజు సత్యం బండి కిరణ్ కుమార్, పరశురాములు, మల్లారెడ్డి, కనకరాజు, భానుచందర్ తదితురులు పాల్గొన్నారు.

◆ **నోట్ బుక్స్ పంపిణీ**

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడ హైస్కూల్లో సిద్దిపేట వాసవీ క్లబ్ సహకారంతో 100 మందికి నోట్ బుక్స్‌ను బుదవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వాసవీక్లబ్ మండల అధ్యక్షులు హరికిషన్ మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథం కోసం వాసవీ క్లబ్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, నాయకులు రవి, కృష్ణమూర్తి, నాగేందర్, దుర్గయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **గురుకులంలో స్వయంపాలన**

వర్గల్(గజ్వేల్): వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులే అధ్యాపకులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనిర్వచనీయమన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు.

◆ **ఎస్టీటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక**

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఎస్టీటీయూ నూతన కమిటీని బుధవారం ఎంపికచేశారు. మండల ఎస్టీటీయూ నూతన అధ్యక్షుడిగా భాస్కర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా నరేశ్, మహిళా అధ్యక్షురాలిగా రమాదేవిని ఎంపికచే శారు. కార్యవర్గ సభ్యులుగా నరేశ్, లక్ష్మీనారాయణ, అండాలును నియమించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ సమస్యలపై పోరాడుతానన్నారు.

◆ **రెడ్డి జాగృతి నూతన కార్యవర్గం**

దౌల్తాబాద్ (దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ రెడ్డి జాగృతి ఇన్‌చార్జిగా అల్లి శేఖర్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల జాగృతి అధ్యక్షుడిగా దొమ్మాట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్., షాపూర్ గ్రామానికి చెందిన అన్నారెడ్డి గారి చంద్రారెడ్డి ఎన్నికయ్యారు.